క్లుప్తంగా

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



పిట్లం: వాహనదారులు ట్రాఫిక్ నియమ నిబంధనలను పాటించాలని హెడ్ కానిస్టేబుల్ సాయాగౌడ్ సూచించారు. ఆయన సిబ్బందితో కలిసి శుక్రవారం మండలంలోని బ్రహ్మణపల్లి గేట్ వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. లైసెన్స్ ఉన్నవారు మాత్రమే వాహనలను నడపాలని పేర్కొన్నారు. సరైన ధృవపత్రాల్లేని 20 వాహనాలకు ఫైన్ వేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సిబ్బంది బుచ్చయ్య, మహేందర్, లాల్‌సింగ్ పాల్గొన్నారు.

చిన్నారులకు వైద్య పరీక్షలు



నస్రుల్లాబాద్(బీర్కూర్): బీర్కూర్ మండల కేంద్రంలోని అంగన్‌వాడి సెంటర్‌లో చిన్నారులకు ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో శుక్రవారం డాక్టర్లు మస్రత్, సంధ్య వైద్య పరీక్షలు నిర్వహించారు. మరిన్ని పరీక్షలు అవసరం కావడంతో ఇద్దరిని స్థానిక పీహెచ్‌సీకి రెఫర్ చేసినట్లు వెల్లడించారు.

కార్మికులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు



పెద్దకొడప్‌గల్: మండల కేంద్రంలో శుక్రవారం కామన్ హెల్త్ సర్వీస్ సెంటర్ జిల్లా మేనేజర్ ప్రవీణ్ నాయక్ ఆధ్వర్యంలో కార్మికులకు ఉచిత వెద్య పరీక్షలు నిర్వహించారు. కార్మికులకు 52 రకాల ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు గ్రౌరె రాములు, ఎంపీపీ ప్రతాప్ రెడ్డి, సొసైటీ చైర్మన్ హన్మంత్ రెడ్డి, వైద్య సిబ్బంది మతిన్, మన్నుజి, భీమ్ రావు, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

పశువుల దాహం తీరేదెలా?



పెద్దకొడప్‌గల్: పశువులకు తాగునీటి ఇబ్బందులను తీర్చేందుకు గ్రామాల్లో నిర్మించిన నీటి తొట్టిల్లో నీరు నింపకపోవడంతో వృథాగా ఉంటున్నాయి. దీంతో పశువుల దాహం తీర్చేందుకు చాలా ఇబ్బంది పడుతున్నామని పశువుల పెంపకం దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పోచారం తండాలో అధికంగా పశువుల పెంపకం దారులు ఉంటారు. పశువుల కోసం నిర్మించిన నీటి తొట్టిల్లో నీళ్లు ఎప్పుడూ నింపిన దాఖలాలు లేవు. అధికారులు స్పందించి మూగజీవాల దాహాన్ని తీర్చాలని కోరుతున్నారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్ల పంపిణీ



బిచ్కుంద: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు హైద్రాబాద్‌కు చెందిన పారిశ్రామికవేత్త దయానంద్ రెడ్డి స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో దాగిఉన్న క్రీడా నైపుణ్యాన్ని బయటకు తీసేందుకు వీలుగా కిట్లను ఇస్తున్నట్లు ఆయన వెల్లడించారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రముఖీ, ఏఎంసీ చైర్మన్ నాగ్‌నాథ్ పటేల్, విఠల్‌రెడ్డి, సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

బోరు బావి తవ్వకం

పిట్లం: మండలంలోని చిన్నకొడప్‌గల్ సహకార సంఘం వద్ద శుక్రవారం సహకార సంఘం చైర్మన్ నారాయణరెడ్డి బోరు బావి తవ్వకం పనులను ప్రారంభించారు. సహకార సంఘం కార్యాలయంతో పాటు స్థానికంగా ఉన్న కాలనీ వాసులకు నీటి సమస్య తీరుతుందన్నారు. బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సహకార సంఘం డైరెక్టర్లు పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పొడిగించాలి

కామారెడ్డి టౌన్: బీసీ కుల వృత్తుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఇవ్వనున్న రూ. లక్ష సాయం కోసం దరఖాస్తు చేసుకునేందుకు గడువు పొడిగించాలని తెలంగాణ జనసమితి పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జడల రజనీకాంత్ కోరారు. 20న గడువు ముగుస్తున్నా చాలా చోట్ల తహసీల్దార్లు కుల, ఆదాయ సర్టిఫికెట్లు ఇంకా జారీ చేయలేదని ఆయన పేర్కొన్నారు.

'గృహలక్ష్మి'కి ధరల ప్రభావం

- ఇంటి జాగా ఉన్న పేదలకు ప్రభుత్వం రూ. 3 లక్షల ఆర్థిక సహాయం
- ఇళ్ల నిర్మాణాలకు ఆసక్తి చూపని పలువురు లబ్ధిదారులు



బాన్సువాడలో ఉన్న రేకుల షెడ్

బాన్సువాడ: ఇంటి జాగా ఉండి సొంతిల్లు లేని పేదలు ఇళ్లు నిర్మించుకునేందుకు గృహలక్ష్మి పథకం కింద ప్రభుత్వం రూ. 3 లక్షలు ఆర్థిక సహాయం చేస్తున్నా ధరల ప్రభావంతో లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదు. గృహలక్ష్మి పథకం పేదలకు వరం లాంటిదని బిల్డర్లు చెబుతున్నారు. అయితే నిర్మాణ వ్యయం భారీగా పెరగడంతో పేదలు ఇల్లు కట్టుకునే పరిస్థితి కన్పించడం లేదు. అయితే గృహలక్ష్మి లబ్ధిదారులు ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) పథకం కోసం దరఖాస్తు చేసుకుంటే మరో రూ. 2 లక్షలు కేంద్రం నుంచి సహాయం అందే అవకాశం ఉంది. అయితే ఈ విషయమై లబ్ధిదారుల్లో అవగాహన కల్పించక పోవడంతో చాలా మంది వాటిని సద్వినియోగం చేసుకునే అవకాశం లేకుండా పోతోంది. కరోనా తరువాత నిర్మాణ రంగంలో అనుహ్య మార్పులు చోటు చేసుకున్నాయి. ఇటుకల ధర భారీగా పెరిగింది. జిల్లాలో ఇటుకల తయారీకి ప్రధాన వనరు అయిన ఎన్టీపీసీ ఫ్లైయాష్‌ను టెండర్లకు ఇవ్వడం ఇందుకు ప్రధాన కారణం. ఒకప్పుడు అక్కడ 30 టన్నుల బూడిద లారీ రూ. 700కి వచ్చేవారు. ప్రస్తుతం అది రూ.12 వేలకు చేరింది. ఫలితంగా ఇటుక ధరలు పెరిగాయి. ఇటుక బట్టీలకు వినియోగించేందుకు వంట చెరువు లభించకపోవడంతో బొగ్గును వాడుతున్నారు. బొగ్గ ధర కూడా విపరీతంగా పెరిగింది. దీంతో ఇటుక బట్టీల్లో ఇటుకలను తయారి చేసిన తర్వాత కాల్చేందుకు ఊక (ఉనుక)తో పాటు బొగ్గును వాడతారు. ప్రస్తుతం ఉనుక టన్ను రూ. 6వేల వరకు ఉంది. దాని ప్రభావం ఇటుకల ధరలపై పడుతోంది. బొగ్గ ధరల ప్రభావం స్టీలుపైనా ఉంటోంది. 2021 ఏడాది వరకు వెయ్యి మట్టి ఇటుకల రూ. 5 వేలు ఉండగా ప్రస్తుతం డిమాండ్‌ను బట్టి రూ. 8,500 నుంచి రూ.10 వేల వరకు వసూలు చేస్తున్నారు.

చదరపు అడుగుకు రూ. 2 వేలు ఖర్చు..

ప్రస్తుత మార్కెట్ ధరల ప్రకారం చదరపు అడుగుకు రూ. రెండు వేల వరకు బిల్డర్లు వసూలు చేస్తున్నారు. కరోనా ముందు రూ.1,500గా ఉండేది. మధ్య తరగతి కుటుంబం పిల్లర్లు వేసి 800 చదరపు అడుగుల డబుల్ బెడ్రూం ఇల్లు నిర్మించుకుంటే దాదాపు రూ.16 లక్షల వరకు ఖర్చువుతోంది. గృహలక్ష్మి పథకంలో నిర్మాణం చేపడితే రూ. 3 లక్షలు ఏమాత్రం సరిపోవడం లేదని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నివాసగృహం లేని వారు పీఎంఏవై పథకానికి దరఖాస్తు చేసుకుంటే మరో రూ.2 లక్షలు వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నా ప్రచారం కల్పించడంలో విఫలమవుతున్నారు. పీఎంఏవై పథకం వర్తింపజేస్తే లబ్ధిదారులకు కొంత ఊరట లభించే అవకాశం ఉంది.

3 వేల మంది లబ్ధిదారుల ఎంపిక

గృహలక్ష్మి పథకం కింద ప్రతి నియోజకవర్గంలో మూడు వేల మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. వీరు సొంతంగా ఇల్లు నిర్మించుకుంటే రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ. 3 లక్షల ఆర్థిక సాయం అందే అవకాశం ఉంది.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

కామారెడ్డి టౌన్: రాష్ట్ర అవతరణ ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన పట్టణ ప్రగతి కార్యక్రమంలో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ శుక్రవారం రూ. 6.76 కోట్లతో కామారెడ్డిలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు శంకస్థాపన చేశారు. పాఠశాల భవనం, వైకుంఠ ధామం, అంగన్‌వాడి భవనం, రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ నిట్టు జాహ్నవి, డీఈవో ఎస్.రాజు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కానుగంటి శారద, పక్కన ప్రజాప్రతినిధులు, అధికారులు

దోమకొండ: పనుల్లో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తీసుకోవాలని సభ్యులు తీర్మానించారు. ఎంపీపీ కానుగంటి శారద అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలో పని చేస్తున్న పలువురు అధికారుల తీరుపై సభ్యులు మండిపడ్డారు. లింగుపల్లి, అంబారిపేట గ్రామాల్లో తూములు లీకేజీ అవుతున్నా ఇరిగేషన్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని సర్పంచ్ సాయిలు, ఎంపీటీసీ పిరంగి రాజేశ్వర్ ఆగ్రహం వ్యక్త చేశారు. ఆర్ అండ్‌బీ గెస్ట్ హౌస్ వద్ద ప్రభుత్వ భూమి కబ్జా చేసినా పట్టించుకొవడం లేదని జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్ ఆరోపించారు. సీతారంపల్లి గ్రామంలో రేషన్ దుకాణం లేనందువల్ల సరుకుల కోసం రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న జనగామకు వెళ్లాల్సి వస్తోందని స్థానికంగా రేషన్ షాపు ఏర్పాటు చేయాలని సర్పంచ్ జాలిగాం నాంపల్లి తహసీల్దార్‌ను కోరారు. రైతులకు ఎరువులు అందుబాటులో ఉండేలా చూడాలని, నకిలీ విత్తనాలను అరికట్టాలని వ్యవసాయాధికారి పవన్‌కుమార్‌ను కోరారు. పంచాయితీరాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న పనులపై ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వడం లేదని ఏఈ సురేందర్‌రెడ్డిని ప్రశ్నించారు. సీడీసీ చైర్మన్ ఐరేని నర్సయ్య, వైస్ ఎంపీపీ బాపురెడ్డి, తహసీల్దార్ కాశిక్‌రెడ్డి, ఎంపీడీవో చిన్నారెడ్డి, సింగిల్‌విండో చైర్మన్‌లు నాగరాజ్‌రెడ్డి, తిరుపతిగౌడ్, మండల రైతుబంధు అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, ఆర్‌అండ్‌బీ డీఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నాణ్యతలేని విత్తనాలు విక్రయిస్తే చర్యలు



తాడ్వాయిలోని విత్తన విక్రయ షాపులో తనిఖీ చేస్తున్న ఏడీఏ రత్నం



బిచ్కుందలో ఏవో పోచయ్య..

సాక్షి, నెట్‌వర్క్: నాణ్యతలేని విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని షాపు నిర్వాహకులను వ్యవసాయ శాఖ అధికారులు హెచ్చరించారు. తాడ్వాయి మండంలోని పలు గ్రామాల్లో ఏడీఏ రత్నం, ఏవో శ్రీకాంత్, బిచ్కుందలో ఏవో పోచయ్య, పెద్దకొడప్‌గల్‌లో ఏడీఏ నూతన్ కుమార్, ఏవో నదియ్, ఏఈవోలు ప్రియాంక, రూప విత్తన, ఎరువుల షాపులను శుక్రవారం తనిఖీ చేశారు. స్టాక్ బోర్డు ఏర్పాటు చేయాలని, రైతులు కొనుగోలు చేసిన వాటికి బిల్లులు ఇవ్వడంతో పాటు వారి సంతకాలు తప్పనిసరిగా తీసుకోవాలని వారు సూచించారు.

కమ్యూనిటీ భవన నిర్మాణాలకు భూమి పూజ



నస్రుల్లాబాద్: బీర్కూర్ మండలంలోని బరంగేడ్గి గ్రామంలో నూతనంగా నిర్మించనున్న మున్నూర్ కాపు భవన నిర్మాణానికి శుక్రవార జెడ్పీటీసీ స్వరూప, మాజీ జెడ్పీటీసీ ద్రోణవల్లి సతీష్ భూమి పూజ చేశారు. నియోజకవర్గంలో కుల సంఘాల అభివృద్ధికి స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్నారని పేర్కొన్నారు.

సదాశివనగర్: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ భవన నిర్మాణానికి మాజీ ఉప సర్పంచ్ మర్కంటి దాకయ్య, బీఆర్ఎస్ నాయకుడు కొమ్ము సాయిలు భూమి పూజ చేశారు. నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే జాజాల సురేందర్‌కు వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

కామారెడ్డి అర్బన్: ఉగ్రవాయి గ్రామంలో ఎంపీపీ పిప్పిరి అంజనేయులు అంబేద్కర్ సంఘ భవన ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సునీత, ఉప సర్పంచ్ పొన్నాల శ్రీనివాస్, వార్డు సభ్యులు కవిత, పద్మ, అశోక్, రాజు, శంకర్, బాలనర్సు, బీఆర్ఎస్ నాయకులు జనార్దన్, రాజశేఖర్, సంజీవులు పాల్గొన్నారు.



పైసలిస్తేనే పని!

- వారం రోజులైనా కుల, ఆదాయ సర్టిఫికెట్లు ఇవ్వని అధికారులు



కామారెడ్డి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న దరఖాస్తుదారులు

కామారెడ్డి టౌన్/కామారెడ్డి క్రైం: కులవృత్తుదారులకు ప్రభుత్వం రూ.లక్ష ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించడంతో కుల, ఆదాయ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసి వారం రోజులైనా మంజూరు చేయడం లేదు. పైసలిచ్చిన వారికి వెంటనే సర్టిఫికెట్లు ఇస్తున్నారని ఆరోపిస్తూ శుక్రవారం కామారెడ్డి తహసీల్దార్ కార్యాలయం వద్ద దరఖాస్తుదారులు ఆందోళన చేశారు. రూ. లక్ష ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకునే గడువు 20వ తేదీతో ముగుస్తుండటంతో కుల, ఆదాయ సర్టిఫికెట్ల కోసం తిరుగుతున్నా కార్యాలయంలో తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్ అందుబాటులో లేరని పలువురు ఆరోపించారు. సర్వర్‌లో ఏర్పడ్డ సాంకేతిక సమస్య కారణంగా సర్టిఫికెట్ల జారీ ఆలస్యం అవుతోందని చెబుతున్నారు. కామారెడ్డి తహసీల్దార్ కార్యాలయంలోనే ఐదు వేలకు పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం.

కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులర్ చేయాలి



ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి వినతి పత్రం అందజేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు

భిక్కనూరు: సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని కోరుతూ తెయూ సౌత్ క్యాంపస్‌లో కాంట్రాక్టు అధ్యాపకులు శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి వినతి పత్రం అందజేశారు. ఉద్యోగాలను రెగ్యులర్ చేస్తామని సీఎం కేసీఆర్ 2015లో హామీ ఇచ్చినా అమలు కాలేదని కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ నారాయణ గుప్త అన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్టు అధ్యాపకులు యాలాద్రి, రమాదేవి, సునీత, సరిత, నరసయ్య, దిలీప్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బందిని..

లింగంపేట: గ్రామ పంచాయితీల్లో పని చేస్తున్న సిబ్బందిని రెగ్యులర్ చేయాలని డిమాండు చేస్తూ ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీవో మల్లికార్జున రెడ్డికి అందజేశారు. కారోబార్, బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ కల్పించి రూ. 19,600 వేతనం రెగ్యులర్ చేయాలని కోరారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలన్నారు. విధి నిర్వహణలో మృతి చెందిన వారికి రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ప్రకాష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పరమేశ్, నాయకులు గంగవ్వ, లక్ష్మన్, సాయిలు, శ్రీను, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం డబ్బులు చెల్లించాలి



ఎల్లారెడ్డిరూరల్: రైతులు విక్రయించిన ధాన్యానికి ప్రభుత్వం వెంటనే డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు శుక్రవారం తహసీల్దార్ సుధాకర్‌కు వినతిపత్రం అందించారు. ధాన్యం విక్రయించి 45 రోజులు దాటినా డబ్బులు రైతు ఖాతాల్ల జమ చేయక పోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సతీష్, రాజేష్, ప్రశాంత్‌గౌడ్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి ఎమ్మెల్యే సహకారం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మెన్ సత్యనారాయణ

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిపాలిటీ అభివృద్ధికి ఎమ్మెల్యే జాజాల సురేందర్ సహకారం మరువలేనిదని మున్సిపల్ చైర్మెన్ కుడుముల సత్యనారాయణ అన్నారు. శుక్రవారం తెలంగాణ దశాబ్ది ఉత్సవాల కార్యక్రమంలో భాగంగా పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అవసరమైన నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. రూ. 3 కోట్లతో కమ్యూనిటీ భవనాలు, రూ. 2 కోట్లతో వైకుంఠధామం,రూ. 2 కోట్లతో ఇంటిగ్రేటెడ్ భవనం,రూ.4.20 కోట్లతో ఆర్టీసీ బస్టాండ్‌లో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. అదేవిధంగా రూ.10 కోట్లతో సీసీ రోడ్లు, రూ. 5 కోట్లతో పెద్ద చెరువు కట్టపై వంతెన నిర్మాణం కోసం ఖర్చు చేసినట్లు వెల్లడించారు. ఆర్డీవో శ్రీను, డీఎస్పీ శ్రీనివాసులు, ఎంపీపీ మాధవి, జెడ్పీటీసీ ఉషాగౌడ్, మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, కౌన్సిలర్లు నీలకంఠం, భూంగారి రాము, సాయిలు, శ్రీనివాస్, పట్టణ, మండల బీఆర్ఎస్ అధ్యక్షులు జలందర్‌రెడ్డి, సతీష్, సొసైటీ చైర్మెన్ నర్సింలు పాల్గొన్నారు.

సరస్వతి ఆలయంలో అక్షరాభ్యాసం



సరస్వతి ఆలయంలో నిర్వహిస్తున్న అక్షరాభ్యాసం

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి పట్టణ పరిధిలోని ఇల్చిపూర్ సరస్వతి అమ్మవారి ఆలయం, హౌసింగ్ బోర్డులోని శ్రీశారదామాత అమ్మవారి ఆలయాల్లో శుక్రవారం చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కొత్తపల్లి ప్రాథమిక పాఠశాలలో..

మాచారెడ్డి: మండలంలోని కొత్తపల్లి ప్రాథమిక పాఠశాలలో కొత్తగా చేరిన ఒకటో తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయులు శుక్రవారం అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా హెచ్ఎం ప్రశాంతి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు వెల్లడించారు.

ఆధ్యాత్మికం

సన్మార్గంలో నడవాలి



బాన్సువాడ రూరల్: మండలంలోని రాంపూర్ తండాలోని జగదాంబ దేవి,సేవాలాల్ మహారాజ్‌ల ఆలయ 16 వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన హోమంలో స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. గిరిజనులను సన్మార్గంలోకి మళ్లించిన గొప్ప వ్యక్తి మహారాజ్ అన్నారు. గిరిజన బాలిక విద్య కోసం హన్మాజి పేట-కోనాపూర్ వద్ద గురుకులం ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.12 కోట్లు మంజూరు చేసిందన్నారు. సీఎం కేసీఆర్ నిర్ణయం మేరకు 26న గిరిజనులకు పోడు భూముల పట్టాలు అందిస్తామన్నారు.

ఆలయాల్లో మాస శివరాత్రి పూజలు

దోమకొండ: మాస శివరాత్రి సందర్భంగా మండల కేంద్రంలోని శివరాంమందిర్, మార్కండేయ మందిరాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అబ్రబోయిన రాజు, మ్యాక నాగరాజు, గంగాధర్, రాజనర్సు, గణేష్, ప్రవీణ్‌కుమార్, అర్చకులు శివశర్మ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల పండుగ



ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని కొక్కొండ గ్రామంలో శుక్రవారం బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని పెద్దమ్మ తల్లికి గ్రామస్తులు బోనాలను సమర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ మాధవి, జెడ్పీటీసీ ఉషాగౌడ్ పాల్గొన్నారు.

జప్తిజాన్కంపల్లిలో..



నాగిరెడ్డిపేట: మండలంలోని జప్తిజాన్కంపల్లిలో గ్రామ దేవతలైన ముత్యాల పోచమ్మ, దుర్గమ్మ, ఎల్లమ్మకు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. మహిళలు నెత్తిన బోనం ఎత్తుకొని గ్రామంలోని వీధుల గుండా ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. సర్పంచ్ దేశబోయిన సాయిలు పండుగ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

శబరి మాత ఆశ్రమంలో..

తాడ్వాయి: మండల కేంద్రంలోని శబరి మాత ఆశ్రమంలో గురువారం రాత్రి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా శబరి మాత ప్రతిమ, దివ్యసమాధి వద్ద భక్తులు వివిధ రకాల పూలతో అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శబరిమాత దివ్య పాదుకలు, చిత్రపటాన్ని పల్లకీలో ఊరేగించారు.

ఊరదమ్మ ఆలయంలో..

భిక్కనూరు: మండలకేంద్రంలో ఊరదమ్మ ఆలయ ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు అమ్మవారికి ఒడి బియ్యం, కట్న కానుకాలను సమర్పించారు.

ఎల్లమ్మ ఆలయంలో..

నస్రుల్లాబాద్: మండల కేంద్రంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో గౌడ సంఘం సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు సాయా గౌడ్ మాట్లాడుతూ నూతనంగా నిర్మించనున్న ఆలయానికి దాతలు ముందుకొచ్చి సహాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ ప్రధాన కార్యదర్శి సాయాగౌడ్, క్యాషియర్ సాయాగౌడ్, ఉపాధ్యక్షుడు మల్లాగౌడ్, సహాయ కార్యదర్శి మైశాగౌడ్, సభ్యులు సాయగౌడ్, బాల మల్లు గౌడ్, చంద్రశేఖర్ గౌడ్, నర్సింలు గౌడ్, కమలవ్వ, కళావతి, నర్సవ్వ పాల్గొన్నారు.

సంక్షిప్తం

మెడికల్ కళాశాల ఏవోగా రాజలింగం

కామారెడ్డి టౌన్: కామారెడ్డి మెడికల్ కళాశాలకు అడ్మినిస్ట్రేషన్ అధికారి(ఏవో)గా రాజలింగం నియమితులయ్యారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన పదోన్నతి పొందారు.

సీడీసీ చైర్మన్‌కు సన్మానం

దోమకొండ: సీడీసీ చైర్మన్ ఐరేని నర్సయ్య, రైతుబంధు మండల అధ్యక్షుడు ముత్యంపేటకు చెందిన తిరుపతిరెడ్డిని శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జెడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, ఎంపీపీ శారద, సర్పంచ్‌లు అంజలి సన్మానించారు.

పాఠశాల నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు

దోమకొండ: ముత్యంపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఋధుల దుర్వినియోగంపై విద్యా కమిటీ చైర్మన్ రాజు ఏంఈవో కార్యాలయ ఇంచార్జి చైతన్యకు ఫిర్యాదు చేశారు.

ఆర్టీఐ కార్యాలయానికి స్థల పరిశీలన

బాన్సువాడ రూరల్: ఆర్టీఐ కార్యాలయం కోసం కొల్లూరు గ్రామంలో ఎంపీఐ శంకర్‌నారాయణ, గిర్దావార్ అశోక్, సర్వేయర్ అనిల్, వినోద్, శ్రీకాంత్‌రెడ్డి స్థల పరిశీన చేశారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం

ఎల్లారెడ్డిరూరల్: కొక్కొండ గ్రామంలో హైమాస్ట్ లైట్లను ఎంపీపీ మాధవి, జడ్పీటీసీ ఉషాగౌడ్ ప్రారంభించారు.

మంచినీళ్ల పండుగను విజయవంతం చేయాలి

నాగిరెడ్డిపేట: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఆదివారం నిర్వహించనున్న మంచినీళ్ల పండగను విజయవంతం చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వినోద్ సూచించారు. పంచాయతీ కార్యదర్శులు, మిషన్ భగీరథ సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఎంపీపీ రాజ్‌దాస్, ఎంపీడీవో రఘు, ఎంపీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన

బిచ్కుంద: దేవాడ, బిచ్కుందలో రెవెన్యూ అధికారులు ఓటు నమోదుపై అవగాహన కల్పించారు. ఆర్ఐ సాయిబాబా మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటరు నమోదు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బస్సు సర్వీసులు పెంచాలి

సదాశివనగర్: అమర్లబండ, ధర్మారావ్‌పేట్ గ్రామాలకు అదనపు బస్సు సర్వీసులు పెంచాలని స్థానికులు ఆర్టీసీ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

ప్రాణాలకు ముప్పు ఉన్నా స్పందించరా?

భిక్కనూరు: ఎంఎస్ఎన్ పరిశ్రమ ద్వారా విడుదలయ్యే వ్యర్థాల వల్ల ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతున్నా అధికారులు స్పందించడం లేదని కాచాపూర్ గ్రామస్తులు ఆరోపించారు. న్యాయం కోసం చేపట్టిన నిరసన దీక్షలు శుక్రవారం నాటికి 53వ రోజుకు చేరుకున్నాయి.

ముదిరాజ్‌లకు ఆర్థిక సహాయం ఇవ్వాలి

నాగిరెడ్డిపేట: బీసీలకు ప్రభుత్వం ఇవ్వనున్న రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని ముదిరాజ్‌లకు కూడా వర్తింపజేయాలని ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు వెంకన్న తహసీల్దార్ సయీద్ అహ్మద్ మస్రూర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

రెడ్డి సంక్షేమ సంఘం కార్యవర్గం ఎన్నిక

భిక్కనూరు: కంచర్ల గ్రామ రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా బాపురెడ్డి, ఉపాధ్యక్షునిగా రామ్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మాధవరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా తిరుపతిరెడ్డి, కోశాధికారిగా లక్ష్మారెడ్డి, కార్యదర్శిగా శేఖర్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా బాలెంల రాజిరెడ్డి ఎన్నికయ్యారు. మహంకాళి ఆలయ కమిటీ చైర్మన్‌గా మట్టి మైపాల్‌రెడ్డిని ఎన్నుకున్నారు.